సాక్షి

అన్నమయ్య జిల్లా

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



గుర్తు కొస్తున్నాయి..
ఆనాటి మధుర జ్ఞాపకాలు

కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు అన్నమయ్య జిల్లా కురబలకోటతో అనుబంధం ఉంది. సీతామా లక్ష్మి సినిమాను ఇక్కడే తీశారు. -8లో..



ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి దుంగలు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.160
రెండోరకం	రూ.70	రూ.108

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 198 మెట్రిక్ టన్నులు



తమ్ముళ్ల తగవు!

- తెలుగుదేశం పార్టీలో నేతల మధ్య తీవ్ర స్థాయిలో వర్గ విభేదాలు
- అభ్యర్థిత్వం కోసం కొందరు.. ఆధిపత్యం కోసం మరికొందరు
- పార్టీ కార్యక్రమాల్లోనూ కార్యకర్తల మధ్య బహిరంగ యుద్ధం
- రాయచోటి 'దేశం'లో అభ్యర్థిత్వంపై రగిలిన రచ్చ
- అన్నమయ్య జిల్లా తెలుగుదేశంలో అయోమయం



సాక్షి రాయచోటి : తెలుగుదేశం పార్టీలో అంతర్గత యుద్ధం కొనసాగుతోంది. నేతల మధ్య కోల్డ్‌వార్‌తో కార్యకర్తల్లో అయోమయం కొనసాగుతోంది. బలంగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోలేక అష్టకష్టాలు పడుతున్న తెలుగుదేశం పార్టీని వర్గ విభేదాలు మరింత దెబ్బతీస్తున్నాయి. అన్నమయ్య జిల్లా తెలుగుదేశంలో ఎవరికి వారుగా పార్టీలో అంతర్యుద్ధం చేస్తున్నారు. నేతలది ఒక దారైతే.. కార్యకర్తలది మరో దారి అవుతోంది. టీడీపీలో ఒకరిపై ఒకరు పైచేయి సాధించేందుకు ఎత్తులకు పైఎత్తులు వేసుకుంటున్నారు. చివరికి తెలుగుదేశం పార్టీ తలపెట్టిన కార్యక్రమాల్లో సైతం బహిరంగ యుద్ధానికి దిగుతుండడంతో అధిష్టానానికి సైతం వ్యవహారం తలనొప్పిగా మారుతోంది. అన్నమయ్య జిల్లాలో అభ్యర్థిత్వం కోసం కొందరు.. ఆధిపత్యం కోసం మరికొందరు పార్టీలోనే యుద్ధం చేస్తున్నారు.

రాయచోటి 'దేశం'లో అభ్యర్థిత్వం చిచ్చు

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో నాలుగు పర్యాయాలుగా ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాయచోటి నియోజకవర్గ ప్రజలు అండగా నిలుస్తూ వస్తున్నారు. అందులోనూ పునర్విభజనలో భాగంగా జిల్లాలు ఏర్పడటం...అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని ప్రకటించడంతో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ప్రజల నుంచి మరింత మద్దతు పెరిగింది. ఇదిలా ఉండగా మరోవైపు తెలుగుదేశం పార్టీలో నేతల మధ్య అభ్యర్థిత్వం విషయంగా కోల్డ్‌వార్ జరుగుతోంది. రెండురోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి





రాంప్రసాద్‌రెడ్డి రమేష్‌రెడ్డి ప్రసాద్‌బాబు

టీడీపీ అధినేత చంద్రబాబును కలువడంతోపాటు టీడీపీ అభ్యర్థి, నియోజకవర్గ ఇన్‌చార్జి తానేనని ప్రకటించారు. పైగా చంద్రబాబును రమేష్‌రెడ్డి కలిసిన అనంతరం అభ్యర్థిత్వం తమ నాయకునికే ఖరారైందంటూ ఆయన వర్గీయులు టపాసులు పేల్చడం రచ్చకు ఆజ్యం పోసింది. దీంతో ఇప్పటికే టిక్కెట్ తమ నాయకుడికే వస్తుందన్న అంచనాల్లో ఉన్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వర్గీయులు సోషల్ మీడియా వేదికగా సెటైర్లు వేస్తున్నారు. ఇదంతా ఫేక్ అంటూ ప్రచారం చేస్తున్నారు. రాయచోటి టీడీపీలో అభ్యర్థిత్వం రేపిన చిచ్చుతో సోషల్ మీడియా వేదికగా ఒకరిపై ఒకరు బురద చల్లుకుంటూ విమర్శలతో రచ్చ రేపుతున్నారు. దీంతో ఆ పార్టీలో రాజకీయ వేడి మొదలైంది. ఇదిలా ఉండగా మరోవైపుమాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు కుమారుడు ప్రసాద్‌బాబు కూడా టిక్కెట్ రేసులో ఉన్నారు. ఇలా రాయచోటి టీడీపీలో మూడు ముక్కలాట కొనసాగుతోంది. నేతలు ఎవరికి వారుగా తమకే సీటు వస్తుందన్న అంచనాల్లో ఉండగా కార్యకర్తలు అయోమయంలో కొనసాగుతున్నారు.

అన్నిచోట్లా ఇదే పరిస్థితి



జిల్లాలోని రాజంపేట, మదనపల్లె, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో వర్గ విభేదాల కారణంగా పార్టీ ప్రతిష్ట మంటగలుస్తోంది. నేతల మధ్య ఐక్యత లేకపోవడంతో నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు.. ఆధిపత్యం ప్రదర్శించేందుకు అధిష్టానం వద్ద పావులు కదుపుతున్నారు. దీంతో పార్టీ కార్యక్రమాల్లో బహిరంగంగానే నేతలు, కార్యకర్తల మధ్య తోపులాటలు, దూషణల పర్వం కొనసాగుతుండడంతో పార్టీ ప్రతిష్ట బజారుకెక్కుతోంది. ఇటీవల జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలోని చిట్వేలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసే విషయంలో తోపులాట జరిగింది. టీడీపీ నేత కస్తూరి విశ్వనాథ నాయుడు, గత ఎన్నికల్లో టీడీపీ తరుపున పోటీ చేసి పరాజయం పాలైన పంతంగాని ప్రసాద్ వర్గాలు పోటాపోటీతో తోసుకుని దూషించుకున్నారు. చివరికి పోలీసులు సర్దిచెప్పి పంపించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాగే మదనపల్లెలో కూడా నాలుగు వర్గాల మధ్య పార్టీ పోరు కొనసాగుతోంది. ఇన్‌చార్జిలు మొదలుకొని ఇతర నేతల మధ్య వర్గ విభేదాలు కొనసాగుతున్నాయి. ఇంకో పక్క రాజంపేటలోనూ మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులు, టీడీపీ నేత జగన్‌మోహన్‌రాజులు టిక్కెట్‌ను ఆశిస్తున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య వర్గవైషమ్యాలు కొనసాగుతున్నాయి. ఇటీవల పార్టీ కార్యాలయంలో కూడా కార్యకర్తల మధ్య తీవ్ర స్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. ఆయా నియోజకవర్గాల్లోనే కాకుండా తంబళ్లపల్లె, పీలేరు తదితర నియోజకవర్గాల్లో కూడా పార్టీ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. దీంతో టీడీపీ అధినేత చంద్రబాబు ఏం చేయాలో దిక్కుతోచక తలపట్టుకునే పరిస్థితి నెలకొంది.

జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం
పేద విద్యార్థులకు వరం



విద్యార్థుల తల్లిదండ్రులకు మెగా చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తదితరులు

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం అర్హులైన పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఒక సువర్ణావకాశమని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లా స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ జాకీర్‌హుస్సేన్, బీసీ సంక్షేమ శాఖ అధికారి సందప్ప, గిరిజన సంక్షేమ శాఖకార్యదర్శి అప్పలాం, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం పేద విద్యార్థులకు వరం లాంటిదన్నారు. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకంపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అన్నమయ్య జిల్లాలో ఈ పథకం ద్వారా నలుగురు విద్యార్థులు ఎంపిక య్యారన్నారు. ఇందులో కాపు కేటగిరికి సంబంధించి ఎం.కౌశిక్‌కుమార్ రూ.6,43,750, రెడ్డి కేటగిరీకి సంబంధించి బి.హర్షవర్ధన్‌రెడ్డికి రూ.6,48,885, మైనార్టీ క్రిస్టియన్ కేటగిరీకి సంబంధించి కె.నేతస్‌అస్టిల్‌కు రూ.6,63, 063, మైనార్టీ కేటగిరీకి సంబంధించి సయ్యద్ ముస రూ.6,00,400 మొత్తం రూ.25,56,098లను విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేయనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది టాప్ 200 విదేశీ యూనివర్సిటీలో అడ్మిషన్లు పొందిన 213 మందికి మొదటి విడత సాయంగా రూ.19.95 కోట్లను సీఎం జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాకు జమచేశారన్నారు.కార్యక్రమం అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు రూ.25,56,098 మెగా చెక్కును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.

▸▸అసైన్‌మెంట్ భూముల గుర్తింపు నివేదికను అందజేయాలి

రాయచోటి : ప్రభుత్వ అసైన్‌మెంట్ భూముల గుర్తింపు ప్రక్రియ యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి అనుమతి నివేదికను పంపించాలని తహసీల్దార్లను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ భవన నిర్మాణాలకు స్థలం చూపించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. త్వరగా కేటాయించి వచ్చేవారం నాటికి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.జగనన్న కాలనీ లేఅవుట్ రెవెన్యూ రికార్డులోని ఆన్‌లైన్‌లలో పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో జరిగే గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ ప్రపోజల్ మంగళవారం నాటికి పంపించాలన్నారు. జాయింట్‌కలెక్టర్ తమీమ్‌అన్సారియా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

▸▸జగనన్న ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి

రాయచోటి: 'నవరత్నాలు, పేదలందరికీ ఇల్లు' పథకంలో భాగంగా జగనన్న ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై తహసీల్దార్‌లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో పెట్టుకొని పనిచేయాలన్నారు. కొన్ని మండలాల్లో అనుకున్న స్థాయిలో ఇళ్ల నిర్మాణం జరగడం లేదని, వచ్చే వారం నాటికి పురోగతి కనిపించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిర్మిస్తున్న ఎస్‌డబ్ల్యుపీసీ షెడ్ల నిర్మాణాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ధనలక్ష్మి, హౌసింగ్ పీడీ శివయ్య, పంచాయతీరాజ్ ఎస్ఈ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



చిట్వేలి ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య తదితరులు

చిట్వేలి: ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించాలని, కాన్పుల సంఖ్యను పెంచాలని అన్నమయ్య జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య సూచించారు. శుక్రవారం ఆయన చిట్వేలి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, వైద్య సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అన్సారీ, సల్మా, ఆరోగ్య విస్తరణాధికారి విజయ్, సీహెచ్‌ఓ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి



ఉమామహేశ్వరమ్మను సత్కరిస్తున్న సర్పంచ్ అంజలి దంపతులు

చిన్నమండెం: రైతులు ఈకేవైసీ చేయించుకోవడం వలన ప్రభుత్వం నుంచి అందే పలు రకాల సబ్సిడీలకు అర్హులవుతారని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లె రైతు భరోసా కేంద్రంలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2023 సంవత్సరం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం కాబట్టి రైతులు చిరుధాన్యాల సాగు వైపు ప్రోత్సహించేలా చూడాలని అధికారులకు సూచించారు. అదే విధంగా పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకొనని రైతులు మరియు ఎన్‌పీసీఐ ఆధార్ లింక్ చేయించుకోని రైతులు తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఉమామహేశ్వరమ్మను కొత్తపల్లె సర్పంచ్ భూమసాని అంజలి దంపతులు శాలువా వేసి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లె సర్పంచ్ అంజలి, వ్యవసాయాధికారిణి గీత, వీఏఏ శివాంజనేయులు, సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థ నిర్మూలనకే రైతుబజార్

ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



మొదటి రోజు కొనుగోలు దారులతో కిక్కిరిసిన రైతు బజార్ (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్: రైతులు, వినియోగదారుల మధ్య ఉన్న దళారీ వ్యవస్థను నిర్మూలించడానికే ప్రభుత్వం రైతు బజారును ఏర్పాటు చేసిందని తెలిపారు. అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రూ.1 కోటి నిధులతో నిర్మించిన రైతు బజార్‌ను శుక్రవారం ఆయన పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, వినియోగదారులకు లాభదాయకంగా ఉండేలా వైఎస్సార్ రైతు బజార్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. రైతులు తాము పండించిన కూరగాయలు ఎలాంటి కమీషన్లు లేకుండా విక్రయించుకొనేందుకు రైతు బజార్ ఒక మంచి కేంద్రంగా మారుతుందన్నారు. రైతులు పండించే అన్ని రకాల కూరగాయలు సరసమైన ధరలకే వినియోగదారులకు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ వందాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, మదనపల్లె నియోజకవర్గ పరిశీలకుడు హబీబ్‌ఖాన్, మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మన్ తబ్రేజ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన్ మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు దిన్నెపాడు రవిరాజు, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కర్లపు విశ్వనాథరెడ్డి, రామాపురం జెడ్పీటీసీ వెంకటరమణ, వైఎస్ ఎంపీపీ రవిశంకర్‌రెడ్డి, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి రూ.85 కోట్లు

కడప కల్చరల్ (వైఎస్సార్‌జిల్లా : జిల్లాలో దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.85 కోట్లు మంజూరు చేసిందని ఆ శాఖ కమిషనర్ ఎం.హరి జవహర్‌లాల్ తెలిపారు. శుక్రవారం వైఎస్సార్ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆయన 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాలో ఇప్పటికి 187 దేవాలయాల కోసం కామన్ గుడ్ ఫండ్ (సర్వశ్రేయో నిధి) ద్వారా రూ. 85 కోట్లను మంజూరు చేశామన్నారు. ఈ పథకంలోని ఆలయాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని, సంవత్సరంలోపు పనులు పూర్తవుతాయని తెలిపారు. పేద బ్రాహ్మణులు అర్చకత్వం చేస్తున్న తక్కువ ఆదాయం గల దేవాలయాలలో నిత్య ధూప దీప నైవేద్యం కింద జిల్లాలో 511 మంది అర్చకులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున మంజూరు అయ్యాయని తెలిపారు.

ఎస్‌పీఎల్ చాంపియన్‌గా ఎస్.కె.ఎస్.సి జట్టు

- సీనియర్ విభాగంలో ఎస్.కె.ఎస్.సి. డిగ్రీ కళాశాల విజయం
- జూనియర్ విభాగంలో ఆర్.కె. వ్యాలీ ట్రిపుల్‌ఐటీ
- వచ్చే సీజన్ ఫైనల్స్ ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో: సీఏవైడీ అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి
- విజేతలకు ట్రోఫీల బహూకరణ



మాట్లాడుతున్న క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి

కడప స్పోర్ట్స్: సాక్షి ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ చాంపియన్‌లుగా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఎస్.కె.ఎస్.సి. డిగ్రీ కళాశాల జట్టు నిలిచింది. జూనియర్ విభాగంలో ఇడుపులపాయ ఆర్.కె. వ్యాలీ ట్రిపుల్‌ఐటీ జట్టు విజయం సాధించింది. శుక్రవారం సాయంత్రం కడప నగరంలోని కేఎస్‌ఆర్‌ఎం క్రీడామైదానంలో బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి విచ్చేసి విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలుగులోకి తీసేందుకు సాక్షి యాజమాన్యం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి టోర్నమెంట్‌లలో పాల్గొనడం ద్వారా ఉన్నతశ్రేణి క్రికెట్ ఆడేందుకు అనుభవం వస్తుందన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో జిల్లాలో క్రికెట్‌ను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. మరెక్కడా లేని విధంగా క్రికెట్ మైదానాలు మనకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో భాగంగా రూ.6 కోట్లతో వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో ఫ్లడ్‌లైట్లు నిర్మాణపనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. క్రీడాకారుల్లోని ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో టాలెంట్‌హంట్ నిర్వహిస్తున్నామని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాక్షి ప్రీమియర్ లీగ్ వచ్చే సీజన్‌లో ఫైనల్‌కు వచ్చే క్రీడాకారులకు వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో ఆడే అవకాశం కల్పిస్తామని తెలిపారు. క్రీడాకారులకు క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి ముఖ్యమని సూచించారు. సీఏవైడీ జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించి, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. సీఏవైడీ కోశాధికారి మహేంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలని సూచించారు. సాక్షి యూనిట్ మేనేజర్ సి.హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ సాక్షి ప్రీమియర్ లీగ్ పోటీలు విజయవంతంగా పూర్తవడానికి సహకరించిన కళాశాలల యాజమాన్యాలు, క్రికెట్ సంఘం ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విన్నర్స్, రన్నర్స్‌కు అతిథుల చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు ఎల్. మునికుమార్‌రెడ్డి, రెహమాన్, సాక్షి ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్. ముజీబుద్దీన్, అడ్వర్‌టైజ్‌మెంట్ రీజినల్ మేనేజర్ డి.సుబ్బారెడ్డి, సర్క్యులేషన్ ఏజీఎం ప్రతాప్‌రెడ్డి, ఏడీవీటీ మేనేజర్ చాముండేశ్వరి, బ్యూరో ఇన్‌చార్జి ఎం.బాలకృష్ణారెడ్డి, స్టాఫ్‌రిపోర్టర్ బి.వి. నాగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతల వివరాలు

సీనియర్ విభాగం: ఎస్.కె.ఎస్.సి. డిగ్రీ కళాశాల, ప్రొద్దుటూరు (విన్నర్స్), ఎస్.వి. డిగ్రీ కళాశాల, కడప (రన్నర్స్)

జూనియర్ విభాగం: ఆర్.కె.వ్యాలీ ట్రిపుల్‌ఐటీ, ఇడుపులపాయ (విన్నర్స్), ఎస్.ఆర్.ఐ.టి. కళాశాల, ప్రొద్దుటూరు (రన్నర్స్)



సీనియర్ విభాగం చాంపియన్‌లుగా నిలిచిన ప్రొద్దుటూరు ఎస్.కె.ఎస్.సి. కళాశాల జట్టు



సీనియర్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు



జూనియర్ విభాగంలో చాంపియన్‌లుగా నిలిచిన ఇడుపులపాయ ఆర్.కె. వ్యాలీ ట్రిపుల్‌ఐటీ జట్టు



జూనియర్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన ప్రొద్దుటూరు ఎస్.ఆర్.ఐ.టి. కళాశాల జట్టు

క్లుప్తంగా

గొర్రెల మందపై కుక్కల దాడి
– 10 గొర్రెలు మృతి

తంబళ్లపల్లె : గొర్రెల మందపై ఊరకుక్కలు దాడి చేసి 10 గొర్రెలను చంపిన సంఘటన గురువారం రాత్రి మండలంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గంగిరెడ్డిపల్లె పంచాయతీ ఎర్రకుంట్లవారిపల్లెకు చెందిన జి.రామస్వామి 60 గొర్రెలను మేపుకొని జీవనం సాగించేవాడు. ఇంటి సమీపంలోని గొర్రెల మందపై అర్ధరాత్రి వేళ ఊర కుక్కలు దాడి చేసి 10 గొర్రెలను చంపివేశాయి. శుక్రవారం తెల్లవారు జామున గొర్రెలు చనిపోయి ఉండటాన్ని కాపరి గుర్తించి బోరున విలపించాడు. రూ.80 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. గ్రామంలో ఊరకుక్కల బెడద ఎక్కువైందని, గతంలో కూడా మందపై దాడి చేసి గొర్రెలను చంపేశాయని ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామ పంచాయతీ అధికారులు ఊరకుక్కలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాలట్యాంకర్ ఢీకొని రిటైర్డ్ ఉపాధ్యాయుడి మృతి


మహంతు (ఫైల్)

గుర్రంకొండ : పాల ట్యాంకర్ ఢీకొని రిటైర్డ్ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. మండలంలోని శెట్టివారిపల్లె పంచాయతీ అరిగలవారిపల్లెకు చెందిన కె.మహంతు(80) ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందాడు. ప్రస్తుతం గుర్రంకొండలోని కుమారుడు ఇంట్లో నివాసముంటున్నాడు. శుక్రవారం ఉదయం పాల కోసం అని ఇంట్లో నుంచి బయలు దేరివెళ్లాడు. పాలు తీసుకొని బస్టాండులోని కడప–బెంగళూరు జాతీయ రహదారి దాటుతుండగా.. రాయచోటి వైపు వెళుతున్న పాలట్యాంకర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మహంతుకు తీవ్ర గాయాలు అయ్యాయి. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి భార్య అనసూయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

ఉత్కంఠగా సాగిన ఫైనల్ పోరు

SPL SAKSHI PREMIER LEAGUE
SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP


కేఎస్ఆర్ఎం మైదానంలో ఎస్.కె.ఎస్.సి, ఎస్.వి.డిగ్రీ కళాశాలల జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్

కడప స్పోర్ట్స్ : సాక్షి ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ ఫైనల్ పోరు ఉత్కంఠగా సాగింది. శుక్రవారం కడప నగరంలోని కేఎస్ఆర్ఎం మైదానంలో సీనియర్స్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో ప్రొద్దుటూరు ఎస్.కె.ఎస్.సి. డిగ్రీ కళాశాల జట్టు, కడప ఎస్.వి.డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఎస్.కె.ఎస్.సి.జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఎస్.వి.డిగ్రీ కళాశాల జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. జట్టులోని యేసన్న 30 పరుగులు చేశాడు. ఎస్.కె.ఎస్.సి.బౌలర్ దేవేంద్ర 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్.కె.ఎస్.సి.జట్టు 14 ఓవర్లలోనే 4 వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. జట్టులోని శివకేశవ 38 బంతుల్లో 50 పరుగులతో రాణించాడు. దీంతో ఎస్.కె.ఎస్.సి.డిగ్రీ కళాశాల జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించి చాంపియన్స్‌గా నిలిచింది.

- కాగా అంతకు మునుపు కేఎస్ఆర్ఎం మైదానంలో ఉదయం నిర్వహించిన సెమీఫైనల్–1లో బద్వేలు శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల జట్టుపై ప్రొద్దుటూరు ఎస్.కె.ఎస్.సి. డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరింది.
- కేఓఆర్ఎం మైదానంలో ఉదయం నిర్వహించిన సెమీఫైనల్–2లో ఎస్.వి.డిగ్రీ కళాశాల జట్టు కేఎస్ఆర్ఎం కళాశాల జట్టుపై విజయం సాధించి ఫైనల్‌కు చేరింది.

అదరగొట్టిన ఆర్.కె.వ్యాలీ జట్టు

జూనియర్ విభాగంలో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో ఇడుపులపాయ ఆర్.కె.వ్యాలీ ట్రిపుల్ ఐటీ జట్టు, ప్రొద్దుటూరు ఎస్.ఆర్.ఐ.టి జట్లు తలపడ్డాయి. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన ఫైనల్‌మ్యాచ్‌లో టాస్ గెలిచిన ట్రిపుల్ ఐటీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 156 పరుగుల భారీ స్కోరు చేసింది. జట్టులోని ఎస్.కె.ఇర్ఫాన్ 28 పరుగులు, వి.మధు 23 పరుగులు చేశారు. ఎస్.ఆర్.ఐ.టి బౌలర్ నిరంజన్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్.ఆర్.ఐటీ జట్టు 8.2 ఓవర్లలో 51 పరుగులకే ఆలౌట్ అయింది. ట్రిపుల్ ఐటీ బౌలర్లు చిన్న వెంకటేష్ 4, గంగాధర్ 3 వికెట్లు తీశారు. దీంతో ఆర్.కె.వ్యాలీ ట్రిపుల్ ఐటీ జట్టు 105 పరుగుల తేడాతో విజయం సాధించింది.


మ్యాచ్ నిర్వహిస్తున్న అంపైర్లు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయాల పాలయ్యారు. ఎస్‌ఐ షరీఫ్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో యర్రగుంట్ల దళితవాడకు చెందిన లోకేష్, మహేశ్ ద్విచక్రవాహనంలో రాయచోటికి వెళ్తుండగా.. గాలివీడు మండలానికి చెందిన నాగేశ్వర ద్విచక్రవాహనంలో సంబేపల్లె మండలంలోని వట్టంవాండ్లపల్లెస్తుకు వస్తున్నారు. నారాయణరెడ్డిపల్లె పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే ఈ రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వారు ముగ్గురూ గాయపడ్డారు. వారిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతి ఆత్మహత్య

మదనపల్లె : అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. మట్లివారిపల్లె పంచాయతీ గొడ్డింద్లవారిపల్లెకు చెందిన మోహన్ కుమార్తె జి.కౌసల్య(18) ఎనిమిదో తరగతి వరకు చదివి ప్రస్తుతం ఇంటి వద్దే వ్యవసాయ పనులు చేస్తోంది. ఈ క్రమంలో కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు గమనించి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమంగా మారడంతో మృతి చెందింది. యువతి మృతి సమాచారాన్ని అందుకున్న ముదివేడు పోలీసులు ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ..


టి.సుబ్బమ్మ మృతదేహం

పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించి న వృద్ధురాలు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవా రం మృతి చెందింది. చిత్తూరు జిల్లా పుంగనూరు మండ లం కొత్తపల్లెకు చెందిన టి.సుబ్బమ్మ(70) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. రెండు రోజుల క్రితం పు రుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తర లించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. ఆమెకు ఇద్దరు సంతానం ఉన్నారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ముగ్గురు ఆత్మహత్యాయత్నం

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యకు ప్రయత్నించారు. మదనపల్లె మండలంలోని సీటీఎం నేతాజీ కాలనీకి చెందిన కేశవ భార్య ఎం.లక్ష్మీదేవి(45) కుటుంబ సమస్యలతో జిల్లేడుపాలు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అదే విధంగా మదనపల్లె పట్టణంలోని చంద్రా కాలనీకి చెందిన గోవిందు కుమారుడు జి.రాజేంద్రప్రసాద్(23) భార్యతో గొడవపడి బ్లేడుతో చేయి కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. చౌడేపల్లె మండలం కాగతి గ్రామానికి చెందిన అప్పయ్య కుమారుడు కె.రెడ్డెప్ప(35) కుటుంబ సమస్యలతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను 108 అంబులెన్స్‌లలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా
– భార్య మృతి, భర్తకు గాయాలు

పెండ్లిమర్రి : కడప–పులివెందుల ప్రధాన రహదారిలోని సోగాల్‌పల్లె గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి ఆటో బోల్తా పడటంతో భార్య మృతి చెందగా, భర్తకు గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎం.నాగజ్యోతి(30) భర్త మల్లికార్జునతో కలిసి ఆటోలో వేంపల్లెకు వెళ్తోంది. సోగాల్‌పల్లె వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో ఆమె తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందింది. మల్లికార్జునకు గాయాలు అయ్యాయి. వారికి ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

కనుమలోపల్లె వద్ద ఇద్దరికి గాయాలు

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో ఉన్న శనేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. సిద్దవటం మండలంలోని వాసవీ ఫార్మసిస్టు కళాశాలకు చెందిన మెటీరియల్‌ను కడప రిమ్స్ నుంచి ఆటోలో తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కడపకు చెందిన మోహన్, ఆటో డ్రైవర్ అల్లాబకష్‌కు గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కడప అగ్రికల్చర్ : కడపలోని పలు ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు లోకేశ్వరరెడ్డి(డీఈఈ), శ్రీనివాసులు(ఏజీ మైన్స్) శుక్రవారం కడప వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డితో కలిసి తనిఖీలు చేపట్టారు. దేవునికడప రోడ్డు జయశంకర్ పెస్టిసైడ్ అండ్ ఫర్టిలైజర్స్‌లో రిజిస్టర్‌లో ఉన్న స్టాక్‌కు, గోడౌన్‌లో ఉన్న స్టాక్‌కు తేడాలు ఉన్న రూ. 10,11,150 విలువ చేసే 36.75 టన్నుల డీఏపీ, 15.15.15.09 ఎరువులు, పాతబస్టాండ్‌లోని రైతు డిపోలో రూ.3,46,600 విలువ చేసే 13.35 మెట్రిక్ టన్నుల అమ్మోనియం సల్ఫేట్, 20.20.0.13 రకానికి చెందిన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేస్తూ నోటీసులు జారీ చేశారు.

విలేకరిపై కాల్పులు

ఆలస్యంగా వెలుగులోకి ఘటన


ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణానికి చెందిన పర్వతరెడ్డి అనే విలేకరిపై గుర్తు తెలియని వ్యక్తి కాల్పులు జరిపినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పర్వతరెడ్డి కుమారుడు భరత్‌రెడ్డి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ సంఘటన వెలుగు చూసింది. అర్బన్ సీఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 31న సాయంత్రం పర్వతరెడ్డి చిత్తూరు రోడ్డు వైపు నుంచి ద్విచక్రవాహనంపై పట్టణంలోకి వస్తుండగా శివాలయం చెక్‌పోస్టు సమీపానికి రాగానే కాల్పులు జరిగినట్లు తెలిపారు. అయితే విలేకరి మాత్రం తనకు వాహనాల టైర్ల కింద నుంచి ఏదైనా రాయి వచ్చి గుచ్చుకొందని భావించి, అదే రోజు కడపలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొన్నాడు. శరీరం లోపల బుల్లెట్ ఉన్నట్లు వైద్యులు చెప్పడంతో వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ఆస్తి తగాదాల కారణంగానే ఇలా జరిగింటుందనే అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశాడు.

నిందితులను పట్టుకొని శిక్షిస్తాం : జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

నిందితులను త్వరగా పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాయచోటి జర్నలిస్టుల సంఘం నాయకులు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన నిందితుల కోసం గాలిస్తున్నామని, త్వరలోనే పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. ఈ సంఘటనపై అన్ని కోణాల్లో విచారణ సాగిస్తున్నామని చెప్పారు.

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

దుంగలు, వాహనంతో సహా రూ.7.13 లక్షల సామగ్రి స్వాధీనం


నిందితులు, దుంగలను చూపుతున్న ఎస్‌ఐ

కలికిరి : ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి దుంగలు, వాహనంతో సహా రూ.7.13 లక్షల సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా నిందితులను హాజరు పరిచి, దుంగలను చూపించారు. మండల పరిధిలోని మేడికుర్తి క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపడుతుండగా.. కలకడ వైపు నుంచి ద్విచక్రవాహనం, కారు వేగంగా రావడం, ఆపకుండా వెళ్లడంతో పోలీసులు అటకాయించి పట్టుకున్నారు. ద్విచక్రవాహనంలో ఇద్దరు, కారులో వస్తున్న ఎనిమిది మంది వాహనాలను వదిలి పారిపోతుండగా.. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఏడుగురు పారిపోయారు. తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలై జిల్లాకు చెందిన మణి, పోలూరు తాలుకాకు చెందిన అన్బు, కొడుమాంపల్లికి చెందిన మణిబాబు, కన్నూర్ గ్రామానికి చెందిన శేఖర, చిన్నసేలం తాలుకాకు చెందిన కుల్లన్ కుమార్, జమునమత్తూర్ తాలూకాకు చెందిన భాగ్యరాజ్ మరో నలుగురు కూలీలతో కలిసి సుండుపల్లి వద్ద శేషాచలం అడవుల్లోకి ప్రవేశించి ఎర్రచందనం చెట్లు నరికి దుంగలను అక్రమంగా రవాణా చేసేందుకు ప్రయత్నించారు. వారిలో మణిబాబు, భాగ్యరాజ్, కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు ఎర్రచందనం దుంగలు, కారు, ద్విచక్రవాహనం, మూడు మొబైల్ ఫోన్‌లు, ఇనుప గొడ్డళ్లు మొత్తం రూ.7,13,700 విలువైన సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. వారందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన వాల్మీకిపురం ఇన్‌చార్జి సీఐ నాగేంద్ర, ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి, ఏఎస్‌ఐలు మధుసూదనాచారి, మాబుసాబ్, హెడ్‌కానిస్టేబుళ్లు మనోహర్, రాజేంద్ర, రఫీ, కానిస్టేబుళ్లు చైతన్య, అమరనాథ్, జిలానీ, వెంకటసిద్దు, సుబ్రమణ్యం, హోంగార్డులు నిజాముద్దీన్, రఫీలను జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

మహిమ కోసం మరియతల్లిని ఆహ్వానిద్దాం


ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు (ఇన్‌సెట్) దైవ సందేశం అందజేస్తున్న పాదర్ సుసై నాదన్

కడప కల్చరల్ : మరియతల్లి నడయాడిన ప్రాంతమంతా పావనమవుతుందని, మన జీవితంలో మహిమలు జరిగేందుకు మరియతల్లిని ఆహ్వానిద్దామని టేకూరుపేట విచారణ గురువులు పాదర్ ముళ్లపాటి వరప్రసాద్ అన్నారు. కడప నగరం మరియాపురం పాత చర్చి ఆవరణలో లూర్దుమాత తిరునాల రెండవ రోజున జరిగిన ఆధ్యాత్మిక సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత రేణిగుంట విచారణ గురువులు సుసై నాదన్ వేదికపై దివ్య బలిపూజ సమర్పించారు. అనంతరం పాదర్ వరప్రసాద్ ప్రధాన ప్రసంగం చేస్తూ మరియతల్లి పాదం మహిమాన్వితమని, ఆమె కాలు మోపిన కుటుంబాలలో ఆశీర్వాదాలు, గౌరవ మర్యాదలు లభించి జన్మ సార్థకమవుతుందన్నారు. కార్యక్రమ ప్రారంభంలో ప్రత్యేకంగా అలంకరించిన తేరుపై లూర్దుమాత ప్రతిమను ఉంచి మరియాపురం వీధుల్లో పరిశుద్ధ గీతాలాపనలతో పలువురు గురువుల జపాలతో ఊరేగింపుగా ప్రధాన వేదిక వద్దకు తీసుకు వచ్చారు. ప్రార్థనలనంతరం ఆధ్యాత్మిక సభను ప్రారంభించారు. దివ్య సందేశం అనంతరం స్థానిక కారుణ్య సంఘం ప్రతినిధులు బలిపీఠం అలంకరణ నిర్వహించారు. కోయర్ బృందాలు స్తుతి గీతాలను ఆలపించారు. విచారణ గురువులు బిరుసు రాజా, కె.చంద్ర ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. తిరునాల కమిటీ ప్రతినిధులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పుట్ట గొడుగుల పెంపకం.. లాభదాయకం


మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం మురళీకృష్ణ

కడప అగ్రికల్చర్ : పుట్ట గొడుగుల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకుని అధిక లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర సమన్వయకర్త మురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో పాల పుట్టగొడుగులు, ముత్యపు పుట్టగొడుగుల పెంపకంపై సస్యరక్షణ శాస్త్రవేత్త శిల్పకళ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఇలాంటి ఉపాధి కల్పించే శిక్షణ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. అనంతరం శిక్షణ తీసుకున్న రైతులకు సర్టిఫికెట్స్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

శనగలో ఎస్‌బీఈజీ– 452 రకంతో అధిక దిగుబడి

శనగ పంటకు సంబంధించి ఎస్‌బీఈజీ– 452 రకం విత్తనంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఊటుకూరు కృషి విజ్ఞానకేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన ద్వారా శనగలో ఎస్‌బీఈజీ– 452 విత్తన రకాన్ని రైతులతో సాగు చేయించి శిక్షణతోపాటు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం క్షేత్ర ప్రదర్శనలో భాగంగా పెండ్లిమర్రి మండలం చెన్నంరాజుపల్లె గ్రామంలోని చెన్నారెడ్డి పొలంలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ మురళీకృష్ణ, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త రమాదేవి, శాస్త్రవేత్తలు మహేష్‌బాబు, సాయి మహేశ్వరి, జయలక్ష్మి, రాయలక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్నాయి.. ఆనాటి మధుర జ్ఞాపకాలు

- మరుపురాని సీతామాలక్ష్మి
- కురబలకోటతో కె.విశ్వనాథ్‌కు వీడదీయరాని అనుబంధం


కురబలకోట రైల్వేస్టేషన్‌లో సీతామాలక్ష్మి సినిమా సన్నివేశం (ఫైల్)

కురబలకోట : అపురూప చిత్రాల దర్శకులు, సృజన శీలి కె.విశ్వనాథ్‌కు కురబలకోటతో మరుపురాని అనుబంధం ఉంది. ఆయన దర్శకత్వంలో సీతామాలక్ష్మి సినిమా తీశారు. మండలంలో తొలి సినీ షూటింగ్ కూడా ఇదే. నెల పాటు షూటింగ్ నిర్వహించారు. చంద్రమోహన్, తాళ్లూరి రామేశ్వరి హీరోహీరోయిన్లుగా నటించారు. సినీ షూటింగ్ ఎలా ఉంటుందో చూడటానికి జనం తరలి వచ్చారు. ఆ తర్వాత ఎన్నో ఈ చిత్రాలకు ఆద్యమైంది. 1978 జూలై 27న రిలీజ్ అయ్యింది. సూపర్ హిట్. చిన్న సినిమాగా రిలీజై పెద్ద పేరు తెచ్చుకుంది. మండలంలోని తెట్టు, కురబలకోట రైల్వేస్టేషన్‌లో పలు సన్నివేశాలు తీశారు. ఈ సినిమా ఆయన కేరీర్‌కు నిచ్చెనలా మారింది. మరో వైపు హీరోగా చంద్రమోహన్ కేరీర్‌కు కూడా దోహదపడింది. తాళ్లూరి రామేశ్వరికి హీరోయిన్‌గా తొలి చిత్రమిది. ఉత్తమ నటిగా నంది అవార్డు అందుకున్నారు. ఈ సినిమాను తమిళం, హిందీలో తీశారు. ఇప్పటికీ కురబలకోట రైల్వే స్టేషన్‌ను సీతామాలక్ష్మి స్టేషన్‌గా పిలుస్తుంటారు. కె.విశ్వనాథ్ మృతితో మండల వాసులు సీతామాలక్ష్మి సినిమా షూటింగ్ నాటి సంగతులను గుర్తు చేసుకుంటున్నారు.

మదనపల్లె అంటే విశ్వనాథుడికి ఎంతో ఇష్టం

మదనపల్లె సిటీ : కళాతపస్వి, సినీ దర్శక దిగ్గజం కె.విశ్వనాథ్‌కు మదనపల్లె అంటే ఎంతో ఇష్టం. ఆయన తన సన్నిహితులతో తరచూ చెప్పేవారు. భరతముని ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు రొమ్మాల మునికృష్ణారెడ్డికి విశ్వనాథ్‌తో సాన్నిహిత్యం ఉంది. ఈ నేపథ్యంలో 1990 ఏప్రిల్ 1న మదనపల్లెకు ఓ పాఠశాల వార్షికోత్సవానికి వచ్చారు. సిరిమువ్వల సింహనాదం సినిమా కథనాయకులు కళాకృష్ణ, మాధవిలతో కలిసి విచ్చేశారు. పిల్లలకు సామాజిక విలువల గురించి తెలియజేశారు. రెండు రోజుల పాటు మదనపల్లెలోనే బస చేశారు. విశ్వనాథ్‌తో తనకున్న పరిచయం గురించి చైతన్యభారతి పాఠశాల కరస్పాండెంట్ సంపత్ కుమార్ తెలియజేశారు. పలు సార్లు విశ్వనాథ్‌ను కలిసినట్లు తెలిపారు. ఆయన మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. సీతామలక్ష్మి సినిమా చిత్రీకరణ కోసం దర్శకులు విశ్వనాథ్ కురబలకోట మండలం తెట్టు గ్రామానికి వచ్చినట్లు మదనపల్లెకు చెందిన జ్ఞానోదయ పాఠశాల కరస్పాండెంట్ కామకోటి ప్రసాద రావు తెలిపారు. తమ ఇంటిలోనే బస చేశారని ఆయన గుర్తు చేశారు.